క్లుప్తంగా

అలరించిన కూచిపూడి బృంద నాట్య పోటీలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం ఆలయ ప్రాంగణంలోని శ్రీపద్మావతి కళావేదికపై ఆదివారం కూచిపూడి బృంద నాట్య– కళాకృతుల తయారీ పోటీలు నిర్వహించారు. సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధరబాబు ఆధ్వర్యంలో భరతమాత పూజా దినోత్సవాలు జరగ్గా, ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షులు లంక విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వర్తించిన కూచిపూడి బృంద నృత్యాలు అలరించాయి. చిన్నారులు ఉత్సాహంగా రంగోలి పోటీల్లో పాల్గొనగా, వివిధ రకాల ముగ్గులు ఆకట్టుకున్నాయి. చిన్నారులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

రెండో రోజు కొనసాగిన పట్టాభిషేక మహోత్సవాలు



నగరంపాలెం: స్థానిక మారుతినగర్ శ్రీకంచి కామకోటిపీఠ మారుతీ దేవాలయ ప్రాంగణంలో శ్రీమద్ వాల్మీకి రామాయణ అష్టోత్తర శత పారాయణ పూర్వక శ్రీరామమహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు రెండో రోజుకు చేరాయి. ఆదివారం ఉదయం రామాయణ పారాయణాలు ప్రారంభమయ్యాయి. శ్రీమద్ రామాయణంలో 24 వేల శ్లోకాలకు హోమ కార్యక్రమం విశేషంగా నిర్వహించారు. సూర్య నమస్కారాలు చేపట్టగా, సాయంత్రం యథావిధిగా పారాయణి చేపట్టారు. అర్చన హారతి నీరాజనం మంత్రపుష్పాలు స్వామికి దర్బార్ సెలెక్టెడ్ సేవ నిర్వహించారు. తీర్థ ప్రసాద వితరణ జరగ్గా, కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

మోసం చేసిన కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



నెహ్రూనగర్: హైదరాబాద్‌కి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ ఉమ్మడి గుంటూరు జిల్లాలో 585 మంది నుంచి డిపాజిట్లు రూపేనా రూ.6 కోట్లు సేకరించి వారికి తిరిగి డబ్బును చెల్లించకుండా మోసం చేసిన కంపెనీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారులను కలసి ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ఫలితం లేదన్నారు. దీనిపై ప్రభుత్వం తగిన చొరవ తీసుకుని ప్రత్యేకంగా పోలీస్ అధికారులను నియమించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భూపతి సునీల్ కుమార్, చంద్రనాయక్, మాణిక్యరావు, బాబు, సుబ్బయ్య, నాగేశ్వరరావు, సతీష్, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరిపై కేసు

లక్ష్మీపురం: మద్యం తాగి ఇద్దరు ఇతరులతో అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు..కృష్ణానగర్ రైతు మార్కెట్ దగ్గర చంద్రమౌళినగర్‌కు చెందిన జాన్‌పాల్, శ్రీకాంత్ బహిరంగ ప్రదేశంలో కూర్చోని మద్యం తాగి గట్టి గట్టిగా కేకలు వేస్తు వచ్చి పోయే స్థానికులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. వాహనదారులకు ఆటంకం కల్పిస్తుండడంతో హెడ్ కానిస్టేబుల్ స్వర్ణసింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ద్విచక్ర వాహనం చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్యామలానగర్ ప్రాంతానికి చెందిన మేడ ధనగోవింద్ వ్యాపారం చేస్తుంటాడు. 2024 అక్టోబర్ 23వ తేదీ పాత స్వామి థియేటర్ స్థలంలో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్‌కు మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై భార్యతో కలసి వెళ్లారు. షాపింగ్ చేసి తిరిగి బయటకు వచ్చి చూసే సరికి వాహనం కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల, బస్టాండ్, రైల్వే స్టేషన్, సైకిల్ స్టాండ్‌లను పరిశీలించగా ఎంతకు వాహనం కనిపించక పోవడంతో పట్టాభిపురం పోలీసులకు ఆదివారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రుల్లో ఫీజు బోర్డులకు చోటులేదు

- అమలుకు నోచుకోని అల్లోపతి యాక్ట్
- కొంత మంది ఫీజుల బోర్డుల కంటే అధికంగా వసూలు
- బిల్లులు ఇవ్వాలంటే నానా ఇబ్బందులు
- రోగులను నిలువునా దోచుకుంటున్న వైద్యులు
- చోద్యం చూస్తున్న వైద్యాధికారులు



గుంటూరులో ఓ ఆస్పత్రిలో చట్ట ప్రకారం వైద్యులు, ఫీజుల వివరాలు తెలియజేస్తూ ఏర్పాటుచేసిన బోర్డు(ఫైల్)

గుంటూరు మెడికల్: ప్రైవేట్ వైద్యశాలల ఫీజుల దందా నడుస్తోంది. చికిత్సకు ఫీజు బోర్డులు ఆస్పత్రుల్లో ఏర్పాటు చేయడం లేదు. చికిత్స అందించిన తరువాత ఇష్టారాజ్యంగా దండుకుంటున్నరనే ఆరోపణలున్నాయి. వైద్యసేవల వివరాలను చట్టప్రకారం నోటీస్ బోర్డులో పెట్టాలి. కాని చాలా ఆస్పత్రుల్లో ఫీజుల వివరాలు నోటీస్ బోర్డుల్లో పెట్టకపోవటం వల్ల ఆస్పత్రులకు వెళ్లిన రోగులు వైద్యం అయిన పిదప పెద్ద మొత్తాల్లో ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు.

అల్లోపతిక్ యాక్ట్ ప్రకారం...

ఏపీ అల్లోపతిక్ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్ యాక్ట్–2007 ప్రకారం ఏ ఆపరేషన్‌కు ఎంత ఖర్చు అవుతుందో రోగులు తెలుసుకునేలా అందరికి కనిపించే ప్రదేశాల్లో వివరాలతో బోర్డు ఉంచాలి. ఈ చట్టం జిల్లాలో 2008 నుంచి అమల్లోకి వచ్చింది. చట్టం అమల్లోకి వచ్చి 17 ఏళ్ల అయినా చాలా ఆస్పత్రులు, ల్యాబ్‌లు, ఎక్సరే, సీటీ, ఎమ్మారై, స్కానింగ్ కేంద్రాల్లో ఫీజుల వివరాలు తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయటం లేదు.

చట్టం ఏ చెబుతోంది....

ఏపీ అల్లోపతిక్ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్ యాక్ట్–2007 ప్రకారం అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, ఎక్సరే, ఎమ్మారై, సీటీ, స్కానింగ్ సెంటర్స్ నిర్వాహకులు, ఫిజియోథెరపీ, డెంటల్ హాస్పటల్స్ తప్పనిసరిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ అనంతరం తమ ఆస్పత్రిలో వైద్యసేవలను అందించే వైద్యుల పేర్లు, వారి అర్హతలు, వారు వైద్యం చేసినందుకు, వారి సేవలను వినియోగించుకున్నందుకు చెల్లించాల్సిన ఫీజుల వివరాలను తప్పనిసరిగా రోగులకు కనిపించే విధంగా బోర్డు ఏర్పాటు చేయాలి.

కొంత మంది అడ్డగోలుగా..

జిల్లాలో చట్టం అమల్లోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు 800 హాస్పటల్స్, క్లీనిక్స్, ఇతర వైద్య సేవలు అందించే కేంద్రాలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో రిజిస్టర్ అయ్యాయి. అయితే జిల్లాలో ఆస్పత్రులు, క్లీనిక్‌లు, ల్యాబ్‌ల సంఖ్య రెండు వేలకు పైగానే ఉంది. సగానికి పైగా రిజిస్టర్ చేయించుకోకుండానే వైద్యసేవలను అందిస్తున్నా వైద్యాధికారులు వారిని గుర్తించి నోటీసులు అందజేసి వారిని రిజిస్టర్ అయ్యేలా చేయటంలో విఫలం అవ్వటంపై విమర్శలు వస్తున్నాయి. ఒకసారి రిజిస్టర్ చేయించుకుంటే ఐదేళ్ల వరకు వైద్యసేవలను అందించవచ్చు. రెన్యూవల్ గడువు ముగిసినా తిరిగి రెన్యూవల్ చేయించుకోకుండానే వైద్యసేవలను అందిస్తున్నారు.

మామూళ్ల మత్తులో..

చట్టాన్ని సమర్థంగా అమలు చేయాల్సిన వైద్యాధికారులు, ఆస్పత్రులు, ల్యాబ్‌ల తనిఖీలకు వెళ్లకుండా, కొన్నిసార్లు మొక్కుబడిగా తనిఖీలు చేసి తమకు అందాల్సిన మాముళ్ల ఇవ్వగానే రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంత మంది ఫీజుల వివరాల బోర్డులు పెట్టినా చాలా చిన్న సైజు బోర్డులు పెట్టి మొక్కుబడిగా బోర్డుల పెట్టామనిపించుకుంటున్నారు. ఫీజులు చెల్లించినట్లు రసీదులు ఎవరైనా అడిగితే రసీదులు ఇచ్చేందుకు కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు రోగులను ముప్పతిప్పలు పెడుతున్నాయి.

ప్రభుత్వ వైద్యులది అదే తీరు....

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం పరిధిలో, ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త కార్యాలయం పరిధిలో, గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అధికార పరిధిలో పనిచేస్తున్న వైద్యులు, స్పెషాలిటీ వైద్యులు, సూపర్ స్పెషాలిటీ వైద్యుల్లో చాలా మందికి సొంతంగా ఆస్పత్రులు, క్లీనిక్‌లు, స్కానింగ్, ల్యాబ్ లాంటి వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఉన్నాయి. సేవా భావంతో ప్రభుత్వ వైద్యులుగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ చట్టాల గురించి బాగా అవగాహన ఉన్న ప్రభుత్వ వైద్యుల్లో కూడా అనేక మంది ఫీజుల వివరాలు తెలియజేసే బోర్డులు పెట్టడం లేదు.

కఠిన చర్యలు తీసుకుంటాం.



చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా వైద్యసేవలను అందించే ఆస్పత్రులు, క్లీనిక్‌లు, ల్యాబ్‌ల నిర్వాహకులకు నోటీసులు అందజేస్తాం. తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆదేశాలు ఇస్తాం. ఎవరైనా ఫీజులు తెలియజేసే బోర్డులు పెట్టకుండా ఉన్నట్లు తమకు ఫిర్యాదు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మేము తనిఖీలకు వెళ్లిన సమయంలో ఫీజుల వివరాల బోర్డులు పరిశీలించి నిబంధనల ప్రకారం ఉన్నవారికి మాత్రమే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తున్నాం.

–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు 0863–2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గీతా మందిరం అభివృద్ధికి కృషి చేయాలి



నెహ్రూనగర్: గీతా మందిరానికి పూర్వ వైభవం తెచ్చిన ఘనత వెలుగూరి అభయశ్రీ రత్నప్రసాద్ సొంతమని శాసనమండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పేర్కొన్నారు. చైర్మన్‌గా ఆర్యవైశ్యుల సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా గీతా మందిరాన్ని ఆయన కొత్త వెలుగులతో తీర్చిదిద్దారని అభినందించారు. ఆర్ అగ్రహారంలో ఆదివారం గీతా మందిరం చైర్మన్ వెలుగూరి అభయ శ్రీ రత్న ప్రసాద్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు టీఎల్వీ వీరాంజనేయులు, దేవరశెట్టి చిన్ని, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పడాల సుబ్బారెడ్డి, దూపాటి వంశీ, అచ్చాల వెంకటరెడ్డి, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, బి.దేవానంద్, వెంకటరమణ, బాబు, గంగాధర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, విజయమ్మ, సత్యవతి, ఓర్సు శ్రీనివాసరావు, కొత్తపేట సతీష్, నవీన్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



పనులపై ఆరా తీస్తున్న కమిషనర్

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటి కంట్రోల్ సిబ్బంది, ఎమినిటి కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం కమిషనర్ లాంచెస్టర్ రోడ్, సాయికృష్ణ నగర్, ఆనందపేట, బీఆర్ స్టేడియం రిజర్వాయర్ ప్రాంతాల్లో పర్యటించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టే అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది రికార్డు చేయాలని కోరారు. ఎమినిటి కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పనులను ప్రతి రోజు పరిశీలించాలని, నాణ్యతలో లోపం గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావలని ఆదేశించారు. ఇప్పటికే వార్డు సచివాలయాల వారీగా అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, ప్రాధాన్య క్రమంలో చేపడతామని వివరించారు. అలాగే నగరంలో మెరుగైన పారిశుద్ధ్య పనులు జరిగేందుకు డివిజన్ల పునర్విభజన చేశామని, పనులకు అవసరమైన వాహనాలు, పుష్ కాట్స్, బిన్లు అందించినందున, శానిటరీ ఇన్ స్పెక్టర్లు క్రమ పద్ధతిలో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంటింటి చెత్త సేకరణ, డ్రెయిన్ల శుభ్రం, గ్యాంగ్ వర్క్ ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో శుభ్రం జరగాలన్నారు. పర్యటనలో ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్ స్పెక్టర్ అంగడి రాజేష్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఏడు నూతన ఓపీ కౌంటర్లు ప్రారంభం

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అవుట్ పేషెంట్ విభాగంలో ఆదివారం నూతనంగా నిర్మించిన ఏడు ఓపీ కౌంటర్లను తూర్పు ఎమ్మెల్యే మొహ్మద్ నజీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఏడాది కాలంలో కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా గుంటూరు జీజీహెచ్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆదేశాలతో ప్రభుత్వ నిధులు, కార్పొరేట్ సంస్థల సహకారంతో జీజీహెచ్‌ను పూర్తిగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. అవసరమైన సిబ్బందిని రిక్రూట్ చేస్తామని, ఆరు నెలల్లో నిధులు సేకరించి అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. సాహో జీజీహెచ్ అనే నినాదం ద్వారా సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్ వి రమణ ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టి కార్పొరేట్ వైద్య సేవలను అందించడానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులు ఓపీ చీటీ కోసం ఎక్కువ సమయం వేచి చూడకుండా సుమారు రూ.15 లక్షల తో ఏడు ఓపీ కౌంటర్లను నిర్మించామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే జీజీహెచ్ అభివృద్ధిపై వైద్యాధికారులు, హెచ్‌డీఎస్ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆరో డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత, ఆస్పత్రి అభివృద్ధి సంఘం సభ్యులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, డాక్టర్ రసూల్, డాక్టర్ నాగశ్రీ హరిత, అడ్మినిస్ట్రేటర్ సుధారాణి పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి

లక్ష్మీపురం: మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమ కారిని సావిత్రీబాయి పూలే అని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ అన్నారు. బ్రాడీపేటలోని సావిత్రీబాయి పూలే జయంతి వారోత్సవాలలో భాగంగా సుందరయ్య నగర్, అంబేడ్కర్ నగర్‌లలో జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులు జి.రమణ, ఎ.కళ్యాణి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కే పద్మ, అంగన్‌వా నాయకురాలు రాధా సంధ్యా సుజనా రాణి పాల్గొన్నారు.

అస్తవ్యస్త ఆహార, జీవనశైలితో మూత్ర పిండాల సమస్యలు

డాక్టర్ కిలారి సునీల్ కుమార్

లక్ష్మీపురం: మధుమేహం, అధిక రక్తపోటు, అస్తవ్యస్త ఆహార జీవనశైలే మూత్ర పిండాలు దెబ్బతినటానికి కారణాలని, సైలెంట్ కిల్లర్‌గా పేరొందిన ఈ కిడ్నీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ కిలారి సునీల్ కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ చాపకింద నీరులా నిశ్శబ్దంగా రహస్యంగా జబ్బు పడేతత్వం మూత్ర పిండాలకు ఉందన్నారు. మూత్ర పిండాల వ్యాధులు ప్రారంభ దశలో బయట పడవని, మూడో దశ నుంచి కొన్ని లక్షణాలు బయటక పడతాయని వివరించారు. మూత్రంలో నురగ, అధిక రక్తపోటు, వాపు మీద వేలితో ఒత్తి చూస్తే గుంట పడటం, కాళ్లు, కళ్లు దిగువన వాపు కనిపించడం లాంటి లక్షణాలు కనిపిస్తే మూత్ర పిండాల వ్యాధి బాగా పెరిగినట్లు అని అర్థం అన్నారు. అనంతరం సంస్థ సభ్యులకు పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. సంస్థ సభ్యులు, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి డాక్టర్ కిలారి సునీల్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు.

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

కొరిటెపాడు(గుంటూరు): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఈ నెల 7, 8, 10వ తేదీల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8వ తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలోని ఏ కన్వెన్షన్ సెంటర్, 10వ తేదీన కర్నూలు కమిషన్ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష హాజరు ద్వారా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తారని తెలిపారు.

కృష్ణబాబు కాలనీ ప్రధాన రహదారికి మోక్షం..

సాక్షి ఎఫెక్ట్



నగరంపాలెం: కృష్ణబాబుకాలనీ ప్రధాన రహదారికి మోక్షం లభించింది. గతేడాది నవంబర్ రెండో తేదీన సాక్షిలో 'శివారు కాలనీల్లో మట్టిరోడ్లే దిక్కు'.. అంటూ పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ఓ కథనం ప్రచురితమైంది. ఇందులో కృష్ణబాబుకాలనీ ప్రధాన రహదారి తారురోడ్డుగా వేసేందుకు గతంలో ప్రతిపాదనలు చేపట్టారు. కంకర, చిప్స్‌తో నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే అర్ధాంతంగా పనులు నిలిపివేశారు. భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఎక్కువగా ఏర్పడేది. ఈ క్రమంలో నాలుగైదు రోజుల క్రితం జీఎంసీ అధికారులు ముందుకు కదిలారు. కృష్ణబాబు కాలనీ నుంచి శ్రీరామ మందిరం వరకు సుమారు రెండు కిలో మీటర్ల పొడవునా తారుతో నూతన రహదారి నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ రహదారిపై శ్రీనివాసరావుపేట, నల్లచెరువు, సంపత్‌నగర్, లాల్‌పురం, ఏటుకూర్ వైపు వెళ్లే చోదకులు ఎంచక్కా రాకపోకలు చేస్తున్నారు. గతంలో దుమ్ము, ధూళి ఇంట్లోని పాత్రలపై పడేవని, రోడ్డు నిర్మాణంతో ఆ పరిస్థితుల్లేవని స్థానికులు తెలిపారు.

రమేష్ హాస్పిటల్స్‌లో ప్రతి మంగళవారం వైద్యశిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

గుంటూరు మెడికల్: ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ 36వ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, 25 అవుట్ రీచ్ సెంటర్లలో ప్రతి మంగళవారం ఉచిత కన్సల్టేషన్, రాయితీలతో వైద్యసేవలు అందిస్తున్నట్లు హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు వెల్లడించారు. ఆదివారం గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వార్షికోత్సవ సందర్భంగా ఏపీ గెట్ హెల్దీ అనే నినాదంతో కోస్టల్ కారిడార్ లో మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాల ద్వారా ఉచిత వైద్య సేవలను సమాజంలో పౌరులందరికీ అందిస్తున్నామని తెలిపారు.

జాయింట్ కమిషన్ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ తమకు గుర్తింపు ఇచ్చిందన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, అధునాతనమైన వైద్య చికిత్సలు అందించడం ద్వారా ప్రపంచ ఆరోగ్య రంగ పటంలో 'ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, గుంటూరు' పేరు చేర్చబడటం ఎంతో గర్వ కారణంగా ఉందని పేర్కొన్నారు. అత్యాధునిక క్యాన్సర్ సెంటర్‌ను కూడా త్వరలో అందుబాటులోనికి తీసుకొస్తామని వెల్లడించారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో 'క్లాడ్ డాక్స్ రమేష్' టెలి ఐ.సీ.యూ ద్వారా మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. అత్యాధునిక డ్రోన్ సేవలు ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్యశిబిరంలో 75 మంది వైద్యులు పాల్గొన్నారని, 1700 మంది గుంటూరు, పరిసర ప్రాంత ప్రజలు వైద్య సేవలు పొందారని డాక్టర్.రమేష్ బాబు తెలిపారు. సమావేశంలో డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, గ్రూప్ బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న రాజేంద్రప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను శాసనమండలి కృష్ణా– గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఆదివారం లక్ష్మీపురంలోని తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు హక్కు దరఖాస్తులు తిరస్కరణకు గురైన వారితో పాటు ఇప్పటి వరకు నమోదు చేసుకోని అభ్యర్థులు నోటిఫికేషన్ వచ్చే వరకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునే విధంగా ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.సాంబశివరావు, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయి విశ్వనాథ్, పి.లలితబాబు, నాయకులు ఎస్.వేణుగోపాల్, వీర రాఘవులు, ఏవీ కృష్ణారావు, దౌలా, ప్రభుదాస్ పాల్గొన్నారు.

• రైసు మిల్లు తనిఖీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రాఘవేంద్ర రైసు మిల్లును ఆదివారం తనిఖీ చేసినట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు తెలిపారు. రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. బరువును అంచనా వేయాల్సి ఉందన్నారు. రైసు మిల్లు నిర్వహిస్తున్న వారిపై క్రిమినల్ 6ఏ కేసు నమోదు చేసేందుకు గాను పంచనామా చేస్తున్నట్లు వివరించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారుణిలు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు

స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన్‌మందిరంలో ఆదివారం సాయంత్రం నృత్య కళాభారతి 26వ వార్షికోత్సవాలు నిర్వహించారు. అధ్యక్షుడు నాట్యాచార్య బాలు, నాట్యాచారిణి నవ్యశ్రీ ఆధ్వర్యంలో 85 మంది శిష్య బృందంతో కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. శ్రీసాయి మంజీరా కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు కాజా వెంకటసుబ్రహ్మణ్యం సభకు అధ్యక్షత వహించారు. హైమ హాస్పిటల్ ఎండీ డాక్టర్ హనుమంతరావు, మణి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం నవదుర్గలు, సింగాలి జానపద నృత్యంతో పాటు మూషిక వాహన, ముద్దుగారే, వినాయక కౌత్వం అంటూ అనేక అంశాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఆంధ్ర సంప్రదాయ కళ కూచిపూడి నృత్యాన్ని భావి తరాలకు అందిస్తున్న నాట్యాచార్యులు, పిల్లలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను ఎమ్మెల్యే గళ్లా మాధవి అభినందించారు. కార్యక్రమంలో వీవీఐటీ ట్రస్టీ అరుణప్రియ, సక్కు గ్రూప్స్ డైరెక్టర్ సక్కు మాధవి పాల్గొని మాట్లాడారు.

- నగరంపాలెం